www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 3 ఫిబ్రవరి 2025
5
పశ్చిమ గోదావరి



మార్చి 8 వరకూ పిజిఆర్‌ఎస్ రద్దు : కలెక్టర్



ప్రజాశక్తి - భీమవరం

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో ఈనెల 3వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు ప్రతి సోమవారం జిల్లా, డివిజన్, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను(పిజిఆర్‌ఎస్) జిల్లా అంతట తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పిజిఆర్‌ఎస్‌ను తిరిగి నిర్వహించే లోపుగా ప్రజలు వారి సమస్యలను సంబంధించిన దరఖాస్తులను వారి దగ్గరలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేసుకోవచ్చు అని తెలిపారు. పిజిఆర్‌ఎస్ మళ్లీ ఎప్పుడు నిర్వహించేదో త్వరలో తెలియజేస్తామని అన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు దృష్టిలో ఉంచుకొని సహకరించాలని కోరారు.



పింఛను నిరీక్షణ..!

కొత్త పింఛన్ల మంజూరుపై ప్రభుత్వం మౌనం

ప్రభుత్వం వచ్చి 8 నెలలైనా దరఖాస్తుల స్వీకరణ లేదు

రెండు జిల్లాల్లో దాదాపు పదివేల మందికిపైగా ఎదురుచూపు

వికలాంగుల పింఛన్ల ఏరివేతపై గుట్టుగా వ్యవహారం


పెంచిన పింఛన్ల సొమ్ము గొప్పలతోనే ఊకదంపుడు ఉపన్యాసం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు ఎనిమిది నెలలు గడిచిపోతోంది. గత ప్రభుత్వ హయాంలో అర్హత ఉండి పింఛను రానివారు, ఈ కాలంలో పింఛన్‌కు అర్హత పొందిన వారి సంఖ్య భారీగా ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రూ.మూడు వేల పింఛను సొమ్ము రూ.నాలుగు వేలకు పెంపు చేశామంటూ గొప్పలు చెప్పుకోవడంతోనే ప్రభుత్వం సరిపెడుతోంది. అంతే తప్ప కొత్త పింఛన్ల మంజూరు గురించి మాత్రం నోరుమెదపడం లేదు. దీంతో అర్హత ఉండి పింఛన్ల రాని వృద్ధులు, వికలాంగులతోపాటు ఇతర విభాగాల వారంతా ప్రభుత్వంపై తీవ్ర అసహనం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో 1.86 లక్షలు, పశ్చిమలో 2.27 లక్షల పింఛను లబ్ధిదారులు ఉన్నారు. దాదాపు రెండు జిల్లాల్లో రూ.170 కోట్ల వరకూ పింఛన్ల కింద పంపిణీ చేస్తున్నారు. కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారు రెండు జిల్లాల్లో దాదాపు పది వేల మందికిపైగా ఉన్నట్లు సమాచారం. కొన్ని సచివాలయాల పరిధిలో కొత్త పింఛన్ల కోసం వస్తున్న వారు 50 మంది వరకూ ఉంటారని తెలుస్తోంది. ఆ ప్రకారం రెండు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో పింఛన్‌కు అర్హులు ఉన్నట్లు చెప్పొచ్చు. గత ప్రభుత్వం జనవరి, జూన్‌లో ఏడాదికి రెండు విడతల్లో కొత్త పింఛన్లను మంజూరు చేసేది. కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలైనా కొత్తగా పింఛను ఒక్కటి కూడా ఇవ్వలేదు. ఎంతోమంది వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పింఛను రాక ఆర్థికంగా నలిగిపోతున్నారు. పింఛను కోసం సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఇంకా ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదని సచివాలయ సిబ్బంది చెబుతుండడంతో నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి నెలకొంది. కొత్త పింఛన్ల మంజూరుపై ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తోందన్న చర్చ సర్వత్రా నడుస్తోంది. అనర్హుల పేరుతో పింఛన్ల ఏరివేతను పూర్తిచేసి తర్వాత ఆ స్థానంలో కొత్త పింఛన్లను మంజూరు చేసే అవకాశం ఉందా అన్న అనుమానాలు నెలకొన్నాయి.

గుట్టుగా పింఛన్ల ఏరివేత ప్రక్రియ

వికలాంగుల పింఛన్ల ఏరివేత ప్రక్రియ గుట్టుగా సాగిపోతోంది. ఏరివేత సమాచారం డిఆర్‌డి పీడీలు సైతం తమకు తెలీదన్నట్లు మాట్లాడుతున్నారు. అంతా ఆన్‌లైన్‌లో రాష్ట్ర కేంద్రానికి వెళ్లిపోతుందన్న మాటలు వల్లిస్తున్నారు. వాస్తవానికి జిల్లా అధికారుల పర్యవేక్షణలోనే వికలాంగుల పింఛన్ల అర్హత ప్రక్రియ కొనసాగుతోంది. వికలాంగుల పింఛన్ల ఏరివేత పూర్తయిన తర్వాత వృద్ధులు, వితంతువులు, ఇతర సామాజిక పింఛన్లకు సంబంధించి ఏరివేత ప్రక్రియ జరగనున్నట్లు ప్రచారం సాగుతోంది. కొత్త పింఛన్లు ఇవ్వాలంటే ఉన్న పింఛన్లను తగ్గించుకోవాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత తప్పదని చెప్పొచ్చు. జనాల నుంచి వ్యతిరేకత రాకుండా పింఛన్ల ఏరివేత ప్రక్రియను గుట్టుగా సాగిస్తున్నట్లు సమాచారం. అర్హత ఉన్న వారికి పింఛన్ల మంజూరులో ప్రభుత్వం తాత్సారం చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసిపి ప్రభుత్వం ఉంటే ఈ పాటికి తమకు పింఛను వచ్చేసేదన్న అభిప్రాయం అందరిలోనూ ఏర్పడుతోంది. ఇది ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించే అంశంగా చెప్పొచ్చు. పింఛన్ కోసం జనం గ్రామాల్లోని కూటమి నాయకులను పదేపదే కలుస్తున్నారు. నాయకులకు సైతం ఏంచెప్పాలో అర్థంగాక తలలుపట్టుకుంటున్నారు. కొత్త పింఛన్లు మంజూరు చేస్తే బాగుంటుందంటూ నాయకులు కోరుతున్నారు. జనవరిలో కొత్త పింఛన్లు ఇస్తారంటూ ప్రచారం సాగింది. ఇప్పుడు ఫిబ్రవరి వచ్చిన ఊలుకూపలుకూ లేదు. పింఛను ఎదురుచూపులు ఎప్పటికి తీరతాయో చూడాల్సి ఉంది.



నెల్లూరులో జరుగుతున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభకు జిల్లా నుంచి హాజరైన ప్రతినిధులు, మహాసభలో మాట్లాడుతున్న పి.పూర్ణ

నేడు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల నోటిఫికేషన్

ఏలూరు జిల్లా కేంద్రంగా నామినేషన్ల స్వీకరణ

పదో తేదీ వరకూ నామినేషన్ల ప్రక్రియ

13న విత్‌డ్రాల పర్వం ముగిసాక పోటీ అభ్యర్థుల జాబితా వెల్లడి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల నోటిఫికేషన్ సోమవారం విడుదల కానుంది. నోటిఫికేషన్ విడుదల నుంచి ఈ నెల పదో తేదీ వరకూ నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది. గతంలో ఎంఎల్‌సి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కాకినాడ కలెక్టర్ ఉండడంతో కాకినాడలోనే నామినేషన్ల ప్రక్రియ జరిగేది. ఈ సారి ఏలూరు జిల్లా కలెక్టర్‌ను రిటర్నింగ్ అధికారిగా నియమించారు. దీంతో నామినేషన్ల ప్రక్రియ అంతా ఏలూరు కలెక్టరేట్‌లో జరగనుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. పదో తేదీ వరకూ నామినేషన్ల ప్రక్రియ, 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13వ తేదీ విత్‌డ్రాల పర్వం కొనసాగనుంది. ఎన్నికల పోలింగ్ 27వ తేదీన జరగనుంది. ఇప్పటికే గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి టిడిపి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరం, పిడిఎఫ్ అభ్యర్థిగా డివి.రాఘవులు ఖరారయ్యారు. వైసిపి నుంచి ఈ ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదో తేలాల్సి ఉంది. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా కొంతమంది పోటీలో నిలిచే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలపై టిడిపి ప్రధానంగా దృష్టి సారించి ముందుకు సాగుతోంది. జిల్లాల సిఎం చంద్రబాబు సైతం ఆన్‌లైన్ సమావేశంలో ఆ పార్టీ నాయకులు దిశానిర్దేశం చేశారు. కూటమి నేతలను కలుపుకుని విజయానికి కృషి చేయాలంటూ తెలిపారు. ఆ క్రమంలో పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన డివి.రాఘవులుకు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల మద్దతు ఉంది. ప్రధాన పార్టీలకు దీటుగా తొలిసారి అభ్యర్థులు, కార్పొరేట్ యజమానులు ఎంఎల్‌సిలుగా గెలిచిన ప్రజలకు పెద్దగా ఉపయోగపడిన పరిస్థితి గతంలో ఎక్కడా అందరూ చూశారు. పిడిఎఫ్ అభ్యర్థులుగా గెలిచిన నాయకులు మాత్రం ప్రజాతంత్ర మమేకమవుతూ శాసనమండలిలోనూ, ప్రజలతో కలిసి పెద్దఎత్తున పోరాటాల్లో పాల్గొంటున్నారు. దీంతో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలు రసవత్తరంగా కొనసాగే పరిస్థితి నెలకొంది.

పకడ్బందీగా పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణ

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

నేటి నుంచి నోటిఫికేషన్ జారీ

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.వెంకటేశ్వర్లు





ప్రజాశక్తి - భీమవరం

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పట్టభద్రుల జిల్లా సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. జనవరి 29న ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందని ఆ రోజు నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని తెలిపారు. జిల్లా అంతటా పటిష్టంగా ఎన్నికల కోడ్ అమలు చేస్తున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో 69,884 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రస్తుతం జరుగుతుందని ఎన్నికలకు పది రోజుల ముందు వరకూ దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన వివరాలు వెల్లడించారు.

ప్రశ్న : ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు విడుదలైంది, నోటిఫికేషన్ ఎప్పుడు విడుదల కానుంది?

జనవరి 29వ తేదీన పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ జారీ అయింది. ఈ నెల మూడో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానుంది.

ప్రశ్న : ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా, సహాయ అధికారులుగా ఎవరు వ్యవహరించనున్నారు?

ఏలూరు జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు. అలాగే పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కాకినాడ, బిఆర్ అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల డిఆర్‌ఒలు సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించనున్నారు.

ప్రశ్న : నామినేషన్ల ప్రక్రియ ఎప్పటి నుంచి ప్రారంభమవుతుంది? ఎప్పటి వరకూ స్వీకరిస్తారు? ఎక్కడ స్వీకరిస్తారు?

3న ఏలూరు జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కూడా ఏలూరు కలెక్టరేట్లోనే జరుగుతుంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ స్వీకరణ ప్రక్రియ జరుగుతుంది. (ప్రభుత్వ సెలవు దినాలు మినహా) నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ 10వ తేదీతో ముగుస్తుంది. 11న స్క్రూటినీ, 13న ఉపసంహరణకు అవకాశం ఉంటుంది.

ప్రశ్న : ఎంఎల్‌సి ఎన్నిక ఎప్పుడు జరుగుతుంది? ఎప్పటిలోగా ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది?

ఈ నెల 27న ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ పోలింగ్ ప్రక్రియ జరుగుతుంది. ఓట్ల లెక్కింపు మార్చి 3వ తేదీన జరుగుతుంది. మార్చి 8 లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తికానుంది.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు?

జిల్లాలో 20 మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 93 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. పోలింగ్ కేంద్రాలన్నీ సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాం.

ప్రశ్న : జిల్లాలో కోడ్ అమలుకు చర్యలు చేపట్టారా?

ఎన్నికల షెడ్యూలు విడుదలైన రోజు నుంచి జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ అమల్లోకి వచ్చింది. మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అధికారులను కోడ్ అమలుకు ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగింది. ఎన్నికల కోడ్ సాధారణ ఎన్నికలకు ఉన్నట్లే ఉంటుంది. పొలిటికల్ ప్రతినిధుల అధికారిక కార్యక్రమాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకుండా కట్టేదిట్టమైన చర్యలు తీసుకున్నాం. పొలిటికల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు ఇప్పటికే తొలగించాం. మోడల్ కోడ్ అమలు బృందాలు, ఎఫ్ఎస్‌టి బృందాలు నిరంతరం పని చేస్తున్నాయి.

ప్రశ్న: రూట్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులను నియమించారా?

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలనే ముఖ్యఉద్దేశంతో అన్ని అంశాలనూ క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుంది. రూట్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులను త్వరలో నిర్మించేందుకు అన్ని విధాలా చర్యలు చేపట్టాం. వారికి త్వరలో శిక్షణ ఇచ్చి ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు, సలహాలు అందజేయనున్నాం.

ప్రశ్న : జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు ఎంతమంది ఉన్నారు?


జిల్లాలో 20 మండలాలు ఉన్నాయి. మొత్తం 69,884 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. వారిలో 39,780 మంది పురుషులు, 30,103 మంది మహిళా ఓటర్లు, ఒక ట్రాన్స్ జెండర్ ఓటరు ఉన్నారు.

ప్రశ్న : ఓటర్ల పేర్లు చేర్చడానికి ఏమైనా ఆకాశం ఉందా?

ఫారం-18లో గ్రాడ్యుయేట్ల పేర్లను చేర్చడానికి అవకాశం ఉంది. దరఖాస్తులను ఈనెల 10వ తేదీ వరకూ, అంటే నామినేషన్లు స్వీకరించడానికి చివరి తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు.

వారం రోజుల్లో డయాలసిస్ కేంద్రం ప్రారంభం

పనుల పరిశీలనలో మంత్రి నిమ్మల



డయాలిసిస్ కేంద్రం పనులను తనిఖీ చేస్తున్న మంత్రి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు కానున్న డయాలసిస్ సెంటర్ వారం రోజుల్లో ప్రారంభమవుతుందని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆయన ఆదివారం రూ.12.60 కోట్లతో జరుగుతున్న డయాలసిస్ సెంటర్ కొత్త భవనం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ పనులకు సంబంధించి సంబంధిత శాఖ ఇంజనీరింగ్ అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డయాలసిస్ సెంటర్‌కి సంబంధించి 90 శాతం పనులు జరిగాయని, మరో 3 రోజుల్లో మిగిలిన 10 శాతం పనులు పూర్తి అవుతాయని తెలిపారు. ఈ ప్రాంతానికి చెందిన డయాలసిస్ రోగులు అర్ధరాత్రి సైతం భీమవరం, ఏలూరు, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, అమలాపురం వంటి ప్రాంతాలకు వెళ్లవలసి వస్తుందని, దీంతో ఎన్నో వ్యయప్రయాసలకు లోనవుతున్నారని మంత్రి తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నికల సమయంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు ఇచ్చిన హామీని నెరవేర్చానన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంజూరైన 2 డయాలసిస్ సెంటర్లో ఒకటి పాలకొల్లు అని తెలిపారు. గత టిడిపి ప్రభుత్వంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉండాలనే ఉద్దేశంతో 50 పడకల ఆసుపత్రిని వంద పడకల స్థాయికి పెంచి, కొత్త భవన నిర్మాణాలకు రూ.12.60 కోట్లు తీసుకువచ్చానని అన్నారు. సంవత్సరంనరలో పూర్తి కావలసిన ఈ పనులు దురదృష్టవశాత్తు ప్రభుత్వం మారడంతో ఐదేళ్లయినా పూర్తికాకపోగా జరిగిన పనులు నాణ్యతా ప్రమాణాలతో నోచుకోలేదని, వర్షం వస్తే బీటలు తీసిన ప్రాంతాల్లో నీరు లీకేజ్ అవుతుందని, మొత్తంగా విధ్వంసానికి గురైందని మంత్రి చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఈ పనులను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కొత్త భవనం నిర్మాణంను సుందర వనంగా తీర్చిదిద్దేలా ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాఖాపరమైన ఇంజనీరింగ్ అధికారులతో పాటు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వర్మ, నాయకులు గండేటి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి బాబు, మహమ్మద్ జానీ, మామిడిశెట్టి పెద్దిరాజు, ధనాన్ని సూర్యప్రకాష్, వట్టం గణేష్, మల్లంపల్లి పకీర్ బాబు, చినిమిల్లి గణపతి పాల్గొన్నారు.

ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్

జిల్లాలో సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు



భీమవరంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా ఉందని సిపిఎం నాయకులు ఎం.ఆంజనేయులు విమర్శించారు. భీమవరంలో ఆదివారం బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కార్పొరేట్లకు అనుకూలంగా ఈ బడ్జెట్ ఉందన్నారు. రైతులు కార్మికులతోపాటు వివిధ రంగాలకు కేటాయింపులు గతంకంటే తగ్గించారని అన్నారు. ఎన్నికలు, ఓట్లను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ కేటాయించడం కేంద్ర పాలకులకు రివాజుగా మారిందన్నారు. బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఇంజేటి శ్రీనివాస్, పట్టణ నాయకులు త్రిమూర్తులు, డేగల నాగేశ్వరరావు, చల్లబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : కేంద్ర బడ్జెట్ కోతల బడ్జెట్ అనే సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ విమర్శించారు. భీమవరం రూరల్ తోకతిప్పలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ బడ్జెట్‌ను ప్రజలందరూ వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో బొడ్డు లక్ష్మీపతి, తిరుమాని నాగేశ్వరరావు తిరుమాని హనుమంతు, బసవాని వెంకటేశ్వర్లు, మోక సోమరాజు, నరసింహ స్వామి పాల్గొన్నారు.

యలమంచిలి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చించినాడ జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ మండల నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, స్టాలిన్, వెంకటస్వామి, శివాజీ, విజయ్ కుమార్, రామారావు, శ్రీను, సతీష్, పద్మరాజ్, జోసెఫ్ పాల్గొన్నారు.

మొగల్తూరు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని సిపిఎం మండల కార్యదర్శి ఒడుగు శ్రీనివాస్ విమర్శించారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో సిపిఎం నాయకులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎడ్ల చిట్టిబాబు కొత్తపల్లి నాగరాజు ఆదూరు సాంబమూర్తి జట్టు కార్మికులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుంచి పోలీసు ఐల్యాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారున. అనంతరం నిరసన తెలిపారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ బడ్జెట్‌లో అధికభాగం కార్పొరేట్ల వైపే మొగ్గు చూపారని తెలిపారు. పట్టణ నాయకులు జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, మడకా రాజు మాట్లాడారు. కార్యక్రమంలో నరమాల కృష్ణ, శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, కాలపురెడ్డి కొండలరావు, సత్యనారాయణ, ఎ.ధర్మారావు పాల్గొన్నారు.

తణుకు : కార్పొరేట్లకు అనుకూలమైన బడ్జెట్ అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కామన మునిస్వామి అన్నారు. స్థానిక అమరవీరుల భవనం వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎనిమిదో బడ్జెట్ పేద ప్రజలకు వ్యతిరేకమైన బడ్జెట్ అని, కొద్ది మంది కార్పోరేట్లకు అనుగుణంగా రూపొందించిన బడ్జెట్ అని తెలిపారు. ఈ బడ్జెట్ కేవలం ఢిల్లీ, బీహార్ ఎన్నికలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన బడ్జెట్ అని తెలిపారు. కార్యక్రమంలో పి.దక్షిణామూర్తి, గార రంగారావు, సింగులూరి సత్యనారాయణ, నాసరి రత్నం పాల్గొన్నారు.

ఆచంట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మరోసారి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని సిపిఎం మండల కార్యదర్శి పి.మోహనరావు అన్నారు. స్థానిక మార్కెట్ వద్ద బడ్జెట్‌కు వ్యతిరేకంగా నల్లజెండాలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహనరావు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ నాయకులు ఎస్‌విఎన్.శర్మ, తలుపూరి బుల్లబ్బాయి, కుసుమే జయరాజు, సీనియర్ నాయకులు తోటపల్లి సత్యన్నారాయణ, బండి రంగారావు, తమరాపు దుర్గాప్రసాద్, ఇజ్రాయెల్, కమలాకర్, విఘ్నేశ్వరరావు పాల్గొన్నారు.



తణుకులో..

వీరవాసరం : వీరవాసరం సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి బొర్రా ఆలమహారాజు మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల ఎటువంటి ఉపయోగమూ లేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు పోతుల మృత్యుంజయ, బాలం విజయకుమార్, రెడ్డి రామారావు, కేత జ్యోతి బసు, దుర్గారావు పాల్గొన్నారు.

నరసాపురం : పార్లమెంట్లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో చేనేతకు రూ.200 కోట్లు కేటాయించడం అన్యాయమని ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకుడు బూడిద జోగేశ్వరరావు అన్నారు. స్థానిక 18వ వార్డు వనులమ్మగుడి వద్ద చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు బూడిద జోగేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికైనా పరిశీలించి ఐదువేల కోట్ల రూపాయలు కేటాయించాలని సంఘం డిమాండ్ చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వాసా రామలింగం, నీల్లా బుజ్జి, పిచ్చుక చంద్రరావు, సమతం పాండు రంగారావు పాల్గొన్నారు.

నరసాపురం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మణేశ్వరం సెంటర్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి జల్లి రామ్మోహనరావు మాట్లాడారు. కార్యక్రమంలో బొక్కా శ్రీనివాస్, గుత్తుల నాగేశ్వరరావు, కడలి నాగరాజు, సాగర్, నరసింహస్వామి పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని దేశవ్యాప్త నిరసన

సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోపాలన్, రాజా రామ్మోహన్‌రాయ్

భీమవరం : కార్మికవర్గానికి నష్టం చేసే లేబర్ కోడ్లను రద్దు చేయాలని సిఐటియు దేశవ్యాప్త నిరసన చేపట్టిందని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజా రామ్మోహన్ రాయ్ తెలిపారు. ఈనెల 5వ తేదీన అన్ని మండల కేంద్రాల్లో నిరసన సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. బ్రిటిష్ కాలం నుంచి కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి లేబర్ కోడ్లుగా మార్చిందని అన్నారు. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు లేబర్ కోడ్లపై ఆందోళన చేస్తున్నాయని అన్నారు. కార్మిక హక్కులు కాలరాసే విధంగా యజమానులకు, కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన విధంగా లేబర్ కోడ్లు రూపొందించబడ్డాయన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ విధానాల మీద దేశ వ్యాప్తంగా రైతాంగం ఆందోళన చేస్తుందని, అదేవిధంగా కార్మిక వర్గం కూడా లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళన చేయటానికి సిద్ధపడుతుందని తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించే నిరసన సభలలో జిల్లాలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.


ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన పట్టణ నూతన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రంలోని విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఆదివారం తాడేపల్లిగూడెంలో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ సమావేశంలో పట్టణ నూతన కమిటీ ఎన్నుకున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాదీవెన, వసతి దీవెనలకు సంబంధించిన రూ.2,780 రియంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, జిఒ నెంబర్ 77ను రద్దు చేసి ప్రయివేట్, ఎయిడెడ్ విద్యాసంస్థలలో పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ కల్పించే విధంగా జిఒను రద్దు చేసి, విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు పెంచాలని, డిగ్రీ హానర్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా సంక్షేమ హాస్టళ్ల వసతులు మాత్రం రోజురోజుకూ దిగజారుతున్నాయన్నారు. సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొన్ని సొంత భవనాలు ఉన్నా కనీస మౌలిక సదుపాయాలు లేవని, ఈవిధంగా ఉంటే విద్యార్థులు విద్యకు దూరమవుతారని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తాడేపల్లిగూడెం పట్టణ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పి.నాగేంద్ర, టి.రవిబాబు, పట్టణ ఉపాధ్యక్షులుగా మణికంఠ, గణేష్, కార్యదర్శులుగా కేశవ, పవన్, పట్టణ కమిటీ సభ్యులుగా సత్య దిలీప్, గౌతం, భాను ప్రకాష్, ధనుష్, సుబ్బకర్ మొత్తం 13 మంది సభ్యులతో నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగిందన్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర, రవిబాబు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి, నూతన పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నుకున్నందుకు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.



ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు నాగరాజు

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

కాళ్ల: కాళ్లకూరు గ్రామానికి చెందిన దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకటరామరాజు పేద కుటుంబానికి ఆర్థిసాయం అందించేందుకు ముందుకొచ్చారు. కాళ్లకూరు చెందిన కొత్త కాలనీకి చెందిన దావులూరి మరియమ్మ(65) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మరియమ్మ మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని ట్రస్ట్ సభ్యులు పెన్మత్స నాగరాజు ఆదివారం అందజేశారు. 800 లీటర్ల ఆర్వో వాటర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో దావులూరి సామెల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు కృపాదానం మృతి

ఆచంట : కొడమంచిలి పెదపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుసుమే కృపాదానం(62) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె కలరు. ఆయన సుదీర్ఘకాలం పాటు కాంగ్రెస్‌లో పనిచేశారు. కొడమంచిలి దళిత ఐక్య సంఘ ఏర్పాటులో కీలక పాత్ర వహించారు. మాల మహానాడు బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేశారు. రాష్ట్ర స్థాయిలో మాలమహానాడు చేసిన అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఆయన మృతి కాంగ్రెస్, దళిత సంఘానికి తీరనిలోటు అని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర జెఎసి కో కన్వీనర్ గుమ్మాపు సూర్య వరప్రసాద్, ఎంపిటిసిలు యల్లమెల్లి బేబీ రాజేష్, చిలుకూరి నాగ దుర్గాభవాని నరేంద్ర సంతాపం తెలిపారు.

టిడిపి సభ్యుల కుటుంబానికి బీమా అందజేత

భీమవరం టౌన్ : భీమవరం పట్టణం 36వ వార్డులోని టిడిపి కార్యకర్త గుత్తుల వేణు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా టిడిపి కార్యకర్తల సంక్షేమ ప్రమాద బీమా నిధి నుంచి రూ.2 లక్షల ఆర్థికసాయాన్ని ఆదివారం తోట సీతారామలక్ష్మి టిడిపి నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి అందజేశారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం తీసుకొని ప్రమాదాల్లో మరణించిన కుటుంబాలకు ప్రమాద బీమా అండగా నిలుస్తుందని తెలిపారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు మాట్లాడుతూ టిడిపి కార్యకర్త గుత్తుల వేణు నవంబర్ 23న మహదేవపట్నం వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించిన అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తోట సీతారామలక్ష్మి ద్వారా బీమా నగదు రుసుము జనవరి 28వ తేదీన ఇప్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, మెరగాని నారాయణమ్మ పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

తణుకు : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారి సంయుక్తంగా నిర్వహించిన ఇంటింటి వైద్యంలో ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్‌అహ్మద్ తణుకు, పైడిపర్రు పరిసరప్రాంతాల్లో వచ్చిరిని ఆదుగురు వృద్ధులకు ఉచిత వైద్యం అందజేశారు. నల్లబిల్లి వెంకటేశ్వర్లు(వెంకన్న) ఆర్థిక సహాయంతో ఉచిత మందులు పంపిణీ చేశారు. ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ అమృతరామయ్య పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ తాత్కాలిక రద్దు : మున్సిపల్ కమిషనర్

తాడేపల్లిగూడెం : జిల్లాలో నేటి నుంచి ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కలెక్టర్ ఆదేశాలననుసరించి తాడేపల్లిగూడెం పురపాలక సంఘంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేయడమైనదని తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. పట్టణ ప్రజలందరూ గమనించ వలసిందిగా విజ్ఞప్తి చేశారు.

కొత్తపాలెంలో అన్నసమారాధన

మొగల్తూరు : మండలంలోని కొత్తపాలెంలో ఆదివారం రాత్రి అన్న సమారాధన నిర్వహించారు. గ్రామంలోని పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో కొలువై ఉన్న భద్రకాళి సమేత వీరభద్రునికి గత మూడు రోజులుగా కళ్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా స్వామికి సంబరం నిర్వహించారు. ఈ సందర్భంగా యాత్రికులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బండి ముత్యాలమ్మ సన్నిధిలో యాత్రికులు

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. అధిక సంఖ్యలో యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన భజనలు ఆకట్టుకున్నాయి. ఆలయ జూనియర్ అసిస్టెంట్ ఎం.జగదీష్ కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ, కార్యకమాలను నిర్వహించారు.

దండుమారెమ్మ ఉత్సవాలకు రూ.లక్ష విరాళం

గణపవరం : గణపవరంలో ఉన్న దండు మారెమ్మగుడికి ఆదివారం ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు చేతుల మీదుగా స్థానిక జనసేన నాయకులు రూ.లక్ష విరాళం అందజేశారు. మార్చిలో జరిగే మారెమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తమవంతుగా అందజేస్తున్నట్టు తెలిపారు. జనసేన మండల గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పేరంటాలమ్మకు సారె

ఉండి: మండలంలోని వెలువర్రు గ్రామదేవత శ్రీశ్రీశ్రీ వీర పేరంటాలమ్మ అమ్మవారికి 108 రకాలతో ముందుండి శ్రీనివాసరాజు ఆదివారం సారె సమర్పించారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు పొత్తూరి వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ ఆక్వా రైతు శ్రీనివాసరాజు ప్రతి సంవత్సరం ఏదో ఒక గ్రామదేవతకు 108 రకాలతో సారె సమర్పిస్తుంటారని, నేడు తమ గ్రామ దేవత పేరంటాలమ్మకు సారె సమర్పించడమే కాకుండా గ్రామ ప్రజలకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

విప్ నాయకర్‌కు తప్పిన ప్రమాదం

నరసాపురం: ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్‌కి ఆదివారం పెను ప్రమాదం తప్పింది. నరసాపురం నుంచి విజయవాడ వెళ్తుండగా కృష్ణాజిల్లా మచిలీపట్నం వద్ద ఆయన వాహనానికి ఒక్కసారిగా బైక్ అడ్డుగా రావడంతో బైకని తప్పించే ప్రయత్నంలో అదుపుతప్పి కారు మార్జిన్ ఉన్న చెట్లలోకి దూసుకుపోయింది. వెంటనే ఆయన వెంట ఉన్న గన్‌మెన్, అనుచరులు తేరుకొని కారులో చిక్కుకున్న ఎంఎల్‌ఎని బయటకు తీశారు. ఎంఎల్‌ఎకి, ఆయన వెంట ఉన్నవారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుని అరెస్ట్

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.సుబ్రహ్మణ్యేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది ఆదివారం గణపవరం గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 18 మద్యం సీసాలు స్వాధీనపరుచుకుని, అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

బంగారం వస్తువుల అపహరణ

గణపవరం : గణపవరం పంచాయతీ పరిధిలోని జగన్నాథపురంలో గుర్తుతెలియని దొంగలు స్థానిక నివాసి మహమ్మద్ నజీర్ ఇంట్లోకి శనివారం రాత్రి చొరబడి బంగారం వస్తువులు తీసుకుపోయినట్లు గణపవరం ఎస్ఐ ఎం.మణికుమార్ ఆదివారం సాయంత్రం తెలిపారు. మహమ్మద్ నజీర్ ఇంట్లోని వర్కర్‌గా చేస్తున్నట్లు చెప్పారు. ఈనెల ఒకటవ తేదీన నజీర్ తన కుటుంబ సభ్యులతో వేరే ఊరు వెళ్లారు. గమనించిన గుర్తుతెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి, బీరువాని పగులకొట్టి బంగారం వస్తువులను దొంగిలించినట్లు తెలిపారు. మరునాడు వచ్చి చూసుకుని ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నత్తనడకన రహదారి మరమ్మతు పనులు

అధికారుల నిర్లక్ష్యం.. వాహనదారులకు అవస్థలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రజాసంక్షేమమే ప్రధాన అజెండాగా ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుంది. దీంతో గత ప్రభుత్వాలు చేసిన తప్పులను ఎన్‌డిఏ ప్రభుత్వం చేయకూడదని, అలాంటి నింద ఈ ప్రభుత్వంపై పడకూడదనే విధంగానే ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకమై, ముందుకు సాగాలని ప్రభుత్వం సూచిస్తుంది. అయితే కొందరు అధికారులు గత ప్రభుత్వంపై సవతి ప్రేమ చూపిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా జిల్లాలో ఆర్‌అండ్‌బి అధికారుల తీరుపై ప్రజలతోపాటు ఎన్‌డిఏ పార్టీకి చెందిన కార్యకర్తలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా రహదారులను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చిన ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. సంక్రాంతి పండగ లోపు రహదారులపై ఉన్న గోతులను పూడ్చి, రహదారులను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించింది. అయితే భీమవరం జిల్లాలో రహదారుల మరమ్మతులు పరిశీలిస్తే అధికారుల నిర్లక్ష్యంతో నత్తనడకన నడుస్తున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు కొందరు అధికారుల పనితీరు బాగోలేదని,



నత్తనడకన ఏళ్ల తరబడి ఇదే విధంగా సాగుతున్న పనులు

మెరుగుపరచకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినప్పటికీ ఇక్కడ అధికారుల్లో మాత్రం ఎటువంటి చలనం లేకపోవడంపై ప్రజలు గుర్రుగా ఉన్నారనే చెప్పొచ్చు.

గత ప్రభుత్వం రహదారులకు నిధులు కేటాయించకపోవడంతో జిల్లా వ్యాప్తంగా రహదారులు గోతులతో దర్శనమిస్తున్నాయి. అయితే ఎన్‌డియే ప్రభుత్వం తక్షణమే గోతులు పూడ్చాలని జిల్లాకు రూ.12 కోట్లు కేటాయించినప్పటికీ పనులు మాత్రం మందకొడిగా సాగుతున్నాయని చెప్పవచ్చు. జిల్లా కలెక్టర్ రహదారుల మరమ్మతుల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, ఎక్కడా గోతులు కనిపించకూడదని ఆదేశించినప్పటికీ పనులు మాత్రం ఆ స్థాయిలో జరగడం లేదు. ముఖ్యంగా భీమవరం నుంచి వెంప వెళ్లే రహదారికి ప్రస్తుతం మరమ్మతు పనులు చేపట్టగా ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరోపక్క చూస్తే గత వైసిపి ప్రభుత్వంలో వెంప వంట కాలువ నుంచి పెదగరువు వరకు నిధులు మంజూరు అయినప్పటికీ, ఈ రోడ్డు మాత్రం నిర్మాణం పూర్తి కావడం లేదు. ఏళ్ల తరబడి రోడ్డు నిర్మాణానికి నోచుకోకపోవడంతో రాళ్లు పైకి లేచి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాల టైర్లకు పంచర్ పడటంతో ఫ్యామిలీతో వెళ్లే వారు మరింత ఇబ్బందులు గురవుతున్నారని స్థానికులు చెబు తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ రహదారిని వెంటనే నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



రాళ్లు పైకి లేసి అద్వానంగా ఉన్న రోడ్డు

సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

పెనుమంట్ర : మార్టేరు గ్రామంలో చిరకాలంగా పెక్కు సమస్యలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు సిపిఎం నాయకులు అన్నారు. ఆదివారం సిపిఎం మార్టేరు గ్రామ అధ్యక్షులు చెంబోలు బ్రహ్మాజీ గృహంలో జరిగిన సమావేశంలో స్థానిక సమస్యలపై పలువురు నాయకులు చర్చించారు. మార్టేరు గ్రామంలో పెదపేట, చిన పేటల్లో శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని, పెదపేటలో పలుచోట్ల మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని, జగనన్న కాలనీల సమస్యలు, గ్రామంలో నలు వైపులా ఉన్న చెత్త సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల నేత కె.సుబ్బరాజు, స్థానిక నాయకులు నేతల నాగేశ్వరరావు, బి.రమేష్, జి.సత్తి బాబు, ఎన్.హనుమంతరావు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కెఆర్‌కు సిస్కో నెట్వర్కింగ్ జాతీయ స్థాయి అవార్డు

భీమవరం టౌన్ : భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయస్థాయి సిస్కో నెట్వర్కింగ్ అవార్డు లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా సిస్కో నుంచి వచ్చిన అవార్డును కళాశాల సెక్రటరీ కం కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత వర్మకు అందించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అంతర్జాతీయ కంపెనీ సిస్కో ప్రతి ఏటా భారతదేశంలో అత్యుత్తమ కళాశాలలను గుర్తించి సిస్కో నెట్వర్కింగ్ అకాడమీ అవార్డులు ప్రదానం చేస్తుందని, ప్రస్తుత సంవత్సరానికి గాను తమ కళాశాలకు జాతీయ ఉత్తమ సిస్కో అకాడమీ అవార్డు లభించిందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు చెప్పారు. ఈ అవార్డును అమెరికా నుంచి వచ్చిన సిస్కో నెట్వర్కింగ్ అకాడమీ డైరెక్టర్ లిన్ బ్లూమర్, సిస్కో భారతదేశ సిఎస్ఆర్ హెడ్ అనురాగ్ శ్రీవాత్సవలు కళాశాలకు అందించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. అదేవిధంగా కళాశాల ఐటీ డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ పి.రవి కిరణ్ వర్మ జాతీయ ఉత్తమ సిస్కో అకాడమీ ఇన్‌స్ట్రక్టర్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ, డైరెక్టర్ డాక్టర్ జగపతి రాజు మాట్లాడుతూ కళాశాల ప్రగతికి మంచి కృషిచేసిన ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజును, ఐటీ విభాగాధిపతి డాక్టర్ పి.రవికిరణ్‌వర్మలను అభినందించారు.



మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

ప్రశాంతంగా ఛాంబర్స్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్

పాలకొల్లు : స్థానిక ఛాంబర్స్ విద్యాసంస్థలలో పదోతరగతి, ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. ఈ స్కాలర్‌షిప్ టెస్ట్‌కు పాలకొల్లు పరిసర ప్రాంతాల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల నుంచి విద్యార్థులు 2,436 మంది హాజరైయ్యారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్కాలర్‌షిప్ టెస్టుకు అనూహ్య స్పందన లభించిందని కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు అన్నారు. ఈ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ ద్వారా ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ప్రశ్నాపత్రాలను మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ చేతుల మీదుగా విడుదల చేశారు. అనంతరం మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌కు వచ్చిన విద్యార్థులందరకి ఎగ్జామ్ ప్యాడ్, పెన్ను అందజేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల అడిషనల్ ఛైర్మన్, తటవర్తి కృష్ణమూర్తి, ఛాంబర్స్ కామర్స్ సెక్రటరీ, కటారి నాగేంద్ర, కోశాధికారి నెలకుర్తి సత్యనారాయణ, డాక్టర్ వర్మ, జయప్రకాష్, కిరణ్, సుబ్రహ్మణ్యం, అన్నం నాగభూషణం, మామిడి బాబు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు మోడల్ కోడ్‌ను విధిగా పాటించాలి

జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు

భీమవరం : పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలలో మోడల్ కోడ్‌ను రాజకీయ పార్టీలు తూచ తప్పక పాటించాలని జిల్లా రెవెన్యూ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు కోరారు. భీమవరం కలెక్టరేట్‌లో ఎఆర్ఒ వెంకటేశ్వర్లు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్, మోడల్ కోడ్ గురించి వివరించారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. ఈనెల 3న ఎన్నికల నోటిఫికేషన్ కూడా జారీ అవుతుందన్నారు. ఫిబ్రవరి 3 నుంచి 10వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. 13న నామినేషన్ల ఉపసంహరణ, 27న ఎన్నికల పోలింగ్ ఉంటుందన్నారు. పోలింగ్ బ్యాలెట్ పేపర్ ద్వారా మాత్రమే నిర్వహిస్తారని తెలిపారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని వివరించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు ప్రతినిధులు వంశీరెడ్డి (ఐఎన్‌సి), ఎం.ఆంజనేయులు (సిపిఎం), ఎం.రంగరాజు(బిఎస్‌పి), ఎం.శ్యాంబాబు(టిడిపి), జయశివ(జనసేన), ఇన్‌ఛార్జి ఎలక్షన్స్ సూపరింటెండెంట్ మద్రాపు సన్యాసిరావు పాల్గొన్నారు.

క్రీడలకు కృష్ణారెడ్డి సేవలు నిరుపమానం



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ పితాని

పెనుమంట్ర : బాస్కెట్ బాల్ క్రీడకు అంతర్జాతీయ ప్రఖ్యాతి తెచ్చిన మార్టేరు గ్రామం అని, అలాంటి చోట పుట్టిన పీడీ కర్రి కృష్ణారెడ్డి ధన్యజీవి అని, మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం రాత్రి మార్టేరులోని ఎస్‌విజి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎస్‌విజి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఉద్యోగవిరమణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సుదీర్ఘకాలం పిఇటిగా, పిడిగా సేవలు అందించి, ఎందరో క్రీడా కారులను, తయారు చేయడం గొప్ప విషయం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ బాస్కెట్ బాల్ అధ్యక్షులు చిర్ల బాలాజీ రెడ్డి, నరసాపురం ఆర్‌టిసి డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన తెల్లికోడు గండి పూడుక పనులు

ఉండి : మండలంలోని పాములపర్రు వద్ద ఉన్న తెల్లికోడు గండి పడడంతో ఉండి డిసి వైస్ ఛైర్మన్ మంతెన సాయి లచ్చిరాజు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, అధికారులు పూడిక పనులను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేశారు. ఈ సందర్భంగా సాయి లచ్చిరాజు మాట్లాడుతూ ఆదివారం తెల్లికోడు గండి పడటంతో మురుగునీరు పంట కాలవలోకి వచ్చి రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి రాగా వెంటనే స్థానిక ఎంఎల్‌ఎ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజుకు సమాచారం అందించామని, ఆయన ఆదేశాలతో అధికారులను, నాయకులను అప్రమత్తం చేసి గండి పూడిక పనులను వేగవంతం చేసినట్లు వారు తెలిపారు. ఇప్పటికే పాములపర్రు గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన జలాలను అందించాలనే ఉద్దేశంతో ఉండి పంట కాలువ వద్ద భూములను ఆక్రమించి, వ్యర్థాలను పంట కాలువలోకి వదలడంతో వారిని ఖాళీ చేయించి, ఉండి-పాములపర్రు పంట కాలువను ప్రక్షాళన చేయించారని గుర్తుచేశారు. సుమారు 25 సంవత్సరాల నుంచి స్వచ్ఛ జలాల కోసం పాములపర్రు గ్రామస్తులు ఉద్యమిస్తున్నారని, వారి కలను కనుమూరి రఘురామకృష్ణంరాజు సాకారం చేశారన్నారు. నేడు తెల్లికోడు గండిపడి మురుగు నీరు పంట కాలువలోకి చేరుతుందని సమాచారం అందగానే నాయకులను, అధికారులను అప్రమత్తం చేసి ఇబ్బందులు తలెత్తకుండా చేసిన ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజుకు ఈ సందర్భంగా గ్రామ సర్పంచి కేసన శాంతి కుమారి, బలుసులరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి యడవిల్లి వెంకటేశ్వరరావు, ఉండి నీటి వినియోగదారుల సంఘం ఉపాధ్యక్షుడు గుత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.



పూడిక పనులు చేయిస్తున్న సర్పంచి

వెస్ట్ బెర్రీ స్కూల్లో సాహస, నాయకత్వ శిబిరాల సందడి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈనెల 1, 2వ తేదీలలో వెస్ట్‌బెర్రీ హై స్కూల్లో రెండు రోజులు సాహస, నాయకత్వ శిబిరాలను నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, కలిసికట్టుగా పనిచేయడం, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడం అన్నారు.

థ్రిల్లింగ్ అడ్వెంచర్ యాక్టివిటీస్ : విద్యార్థులు రాపెల్లింగ్, ఫ్లయింగ్ ఫాక్స్, ఫ్రీ ఫాల్, జోర్బింగ్, కయాకింగ్ వంటి కార్యకలాపాలతో సాహస స్ఫూర్తిని అందుకున్నారు. గొప్ప అవుట్‌డోర్‌ల థ్రిల్‌ను అనుభవిస్తూ తమ పరిమితులను పెంచుకున్నారు. అంతేకాకుండా నాయకత్వ లక్షణాలు టీమ్-బిల్డింగ్ వ్యాయామాలు, కమాండో ఛాలెంజ్ కోర్స్ వారి గ్రిట్, స్ట్రాటజీ, సహకారాన్ని పరీక్షించి, వారు నమ్మకమైన నాయకులుగా ఎదగడంలో సహాయపడింది.

వినోదం, ఆటలు : టగ్ ఆఫ్ వార్, హాప్‌స్కాచ్, ఉత్సాహాన్ని నింపే ఉత్తేజకరమైన కార్యకలాపాలు వంటి ఆసక్తికరమైన ఆటలతో ఆనందం, స్నేహభావాలు వెలువరించాయి.

సాయంత్రం వైబ్‌లు : హాయిగా ఉండే భోగి మంటలు, ఉల్లాసమైన సంగీతం, ఆకస్మిక డ్యాన్స్ సెషన్‌లతో సాయంత్రాలు అద్భుతంగా ఉన్నాయి. విశ్రాంతి, వేడుకల సమ్మేళనంగా విద్యార్థులు ఈ కార్యక్రమం ఆస్వాదించారు.

ఇందులో నిపుణులైన బోధకులు, అత్యుత్తమ భద్రతా పరికరాలు, కఠినమైన ప్రోటోకాల్‌తో విద్యార్థులు పూర్తి భరోసాతో ప్రతి కార్యాచరణను ఆస్వాదించారు.

ప్రత్యేక ఆకర్షణలు : హాట్ ఎయిర్ బెలూనింగ్ ఇది ఉత్కంఠ భరితమైన సాహసం. అక్షరాలా ఇది విశాల దృశ్యాలు, మరపురాని జ్ఞాపకాలను అందిస్తోంది.

21 డివిఆర్ అనుభవం : విఆర్ ట్రెక్‌లో భవిష్యత్ ప్రయాణం, ఇక్కడ విద్యార్థులు వర్షం, పొగమంచు, బుడగలు, మెడ పేలుళ్లు వంటి భావాలను వర్చువల్ ప్రపంచాలను అన్వేషించారు. ఊహకు అందని ఇంద్రియ సాహసాన్ని అనుభవించారు. వెస్ట్‌బెర్రీలో అడ్వెంచర్ కమ్ లీడర్‌షిప్ క్యాంప్ కేవలం ఒక ఈవెంట్ కాదిది. విద్యార్థులలో ధైర్యాన్ని నింపి, స్నేహాన్ని ఏర్పరచుకునే ఒక చక్కని అవకాశం. విద్యార్థులకు తమ జీవితాలలో ఇది ఒక సాహసోపేతమైన మరపురాని తియ్యటి జ్ఞాపకంగా మిగిలిపోతుందని పాఠశాల డైరెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు.

చిన్నారి వైద్యానికి సిఎం సహాయ నిధి అందజేత

మరోసారి మానవత్వం చాటిన మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

ఓ చిన్నారి వైద్యానికి సాయం అందిస్తానని మంత్రి నిమ్మల రామానాయుడు ఇచ్చిన మాటను 3 రోజుల్లో నిలబెట్టుకొని మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. సిఎం సహాయ నిధి నుంచి రూ.లక్ష నలభై వేలు మంజూరు చేయించారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. పోడూరు మండలం మట్టపర్రు గ్రామానికి చెందిన తాపీ పని చేసుకునే కుక్కల వెంకట సత్యనారాయణ, సాయి దంపతుల సంవత్సరంన్నర వయస్సు గల చిన్నారి హేమంత్‌కు పుట్టుకతోనే రెండు వృషణములు లేవు. దీనివల్ల ఆరోగ్యపర సమస్యతో యూరినల్‌కు ఇబ్బంది పడుతున్నాడు. గతంలో ప్రయివేట్ ఆస్పత్రిలో లోపల ఉన్న ఒకదానిని బయటికి తీసేందుకు సర్జరీ చేసినా ఫలితం లేకపోయింది. అప్పటికే వైద్యానికి పెద్ద మొత్తంలో ఖర్చయింది. రెండోది కూడా బయటికి తీసేందుకు సర్జరీ అవసరం కావడంతో రూ.2 లక్షలకుపైగా ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో ఆ చిన్నారి తల్లిదండ్రులకు ఆర్థిక స్తోమత లేక మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి, చిన్నారి పరిస్థితిని వివరించగా ఆయన స్పందించారు. చిన్నారికి సర్జరీ చేస్తానన్న వైద్యునితో నేరుగా మాట్లాడి వైద్యం గురించి ఆరా తీశారు. చిన్నారి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మీరు చేసే సర్జరీ వల్ల ఫలితం ఉంటుందా, లేనియెడల మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లో ఆసుపత్రికి తీసుకువెళ్తే మంచిదంటారా అని వైద్యుని వద్ద ప్రస్తావించగా హైదరాబాద్ అవసరం లేదని చిన్నారికి సర్జరీ చేసి మెరుగైన వైద్యం అందిస్తామని వైద్యుడు తెలిపారు. దీంతో ఆర్థికపరంగా తాను సిఎం సహాయ నిధి నుంచి సాయం అందిస్తానని, ఎక్కడా రాజీ పడవద్దని వైద్యునితో చెప్పారు. అక్కడితో వదిలిపెట్టలేదు, చిన్నారికి అవసరమైన ఆర్థిక సాయం అందించేలా నేరుగా సిఎం కార్యాలయంలో చిన్నారి పరిస్థితిని వివరించి సిఎం సహాయ నిధి కింద రూ.లక్ష 40 వేలు రాజమండ్రి మాగ్న మదర్ అండ్ చైల్డ్ ఆసుపత్రిలో వైద్యానికి అప్పటికప్పుడు ఎల్‌ఒసిని తీసుకువచ్చారు. దీనిని చిన్నారి తల్లిదండ్రులకు అందజేసి, వెంటనే ఆసుపత్రిలో చేర్పించి, వైద్యం పొందాలని తెలిపారు. అంతేకాకుండా మరోసారి వైద్యునితో మొత్తం బిల్లులో ఎల్‌ఒసి సొమ్ము పోను మిగిలిన సొమ్ముకు కొంత మినహాయింపు ఇచ్చేలా మాట్లాడారు. దీంతో ఆ చిన్నారి తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తం అయింది. మరీ ముఖ్యంగా మూడు రోజుల్లో వైద్యానికి సాయం అందేలా చేసిన మంత్రి రామానాయుడులోని మానవత్వాన్ని, ఔదార్యంను కొనియాడుతూ కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.

మూగ, చెవుడు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

రెండురోజులపాటు పోటీలు నిర్వహించడం అభినందనీయం : ఎంఎల్‌ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మూగ, చెవుడు గలవారు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉంటున్నారని, క్రికెట్‌లో ఛాంపియన్ షిప్ స్థాయికి వెళ్లడం గొప్ప విశేషమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. ఆదివారం భీమవరం ఎంఎల్‌ఎ క్యాంప్ కార్యాలయంలో 5వ రాష్ట్రస్థాయి మూగ, చెవుడు టీ20 క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీల బ్రోచర్ ఎంఎల్‌ఎ అంజిబాబు ఆవిష్కరించారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ 5వ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను భీమవరంలో రెండు రోజులపాటు నిర్వహించడం అభినందనీయమని, ఈ పోటీలకు తన వంతు సహకారం అందిస్తామని అన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు చెరుకువాడ రంగసాయి, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూపతిరాజు మురళీ కృష్ణంరాజు, సిహెచ్.తాతారావు మాట్లాడుతూ ఈనెల 12, 13 తేదీల్లో భీమవరం గన్నాబత్తుల క్రీడా మైదానంలో 5వ రాష్ట్రస్థాయి మూగ, చెవుడు టీ20 క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీలను నిర్వహిస్తున్నామని, రాష్ట్ర నలుమూలల నుంచి 10 టీమ్‌లు పాల్గొంటున్నాయని, డిఎన్ఆర్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నరసింహరాజు, గాదిరాజు సత్యనారాయణ రాజుల సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారన్నారు. దాతలు, క్రీడాభిమానుల సహకార సౌజన్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. గతంలో నాలుగు సార్లు భీమవరంలోనే పోటీలను నిర్వహించామని, ఈ ఏడాది కూడా భీమవరంలోనే చాంపియన్ షిప్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, అసోసియేషన్ సభ్యులు ఎస్ఎస్.శర్మ, ఎండి రఫి, జి.రామచంద్రరావు, ఆర్.ఉమా మహేష్ పాల్గొన్నారు.

ఇది కార్పొరేట్లకు మేలు చేసే బడ్జెట్

ప్రజాశక్తి - పెనుమంట్ర

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశంలోని కార్పొరేట్‌లకు మేలు చేసేదిగా ఉందని పెనుమంట్ర జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి అన్నారు. సామాన్యులకు, కర్షక, కార్మికులకు, మహిళా స్వావలంభనకు సరైన బడ్జెట్ లేదని ఆమె పేర్కొన్నారు.

ఆశాజనకంగా బడ్జెట్ : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు ఆశాజనకంగా లేవు. రూ.50 లక్షల కోట్లు దాటిన బడ్జెట్లో విద్యారంగానికి కేవలం రూ.1,28,650 కోట్లు కేటాయించారని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. జిడిపిలో ఆరు శాతం విద్యారంగానికి కేటాయించాలని కొఠారి కమిషన్ సూచించిన, అందులో సగం కూడా కేటాయించలేదు. 50 వేల పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబులు ఏర్పాటు చేస్తామనడం మంచి విషయం. దీనివల్ల ప్రయోగాత్మక బోధనకు వీలు కలుగుతుంది.

ప్రకటన

నా క్లయింటు, ఏలూరు మండలం, కొమడవోలు కాపురస్తులు ఉప్పులూరి మునలయ్య గారి కుమారుడు హరిబాబు ఇచ్చిన సంజాయిషి పై యావన్మందికి తెలియచేయునది ఏమనగా..

గత 3 రోజుల క్రింత నాక్లయింట్ కొమడవోలు నుండి ఏలూరు ప్రయాణిస్తుండగా తన బైక్‌పై పెట్టుకున్న బ్యాగ్‌పోయినది. అందు తనకి ఒక అవసరం కోసం పెట్టుకున్న ప్రాంసరీ నోట్లు, 2 చెక్‌బుక్కు (SBI RR పేట బ్రాంచి) కొన్ని తెల్ల కాగితాలు మరియు నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పేపర్స్ కలిగిన బ్యాగ్ పోయినది. ఎంత వెతికినా దొరకలేదు. సదరు బ్యాగ్ దొరికిన వారెవరైన నా క్లయింటుకి అందచేస్తే తగిన పారితోషికం యివ్వబడుతుంది. అట్లు కాక ఎవ్వరైన పై పేర్కొన్న నాక్లయింటు సంతకాలు కలిగిన ఖాళీ ప్రాంశరీ నోట్లు, తెల్ల కాగితాలు, చెక్కులు మరియు నాన్ జుడిషియల్ స్టాంప్స్ ఉపయోగించిన ఎడల వారిపై నా క్లయింటు క్రిమినల్ ప్రోసిక్యూషన్ చేపడుదురని యిందుమూలంగా తెలియపర్చడమైనది.

N.V.Satyanarayana B.Sc.,B.L.
Advocate, Near Ambica Theater
Center, Western St,
Eluru -534 001.
Cell: 94403 76655

Eluru
Dt.3-2-2025

మహారాజశ్రీ 7వ అదనపు జిల్లా జడ్జి (ఫ్యామిలి జడ్జి) వారి కోర్టు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా

I.A.No.213/2020 in O.S.No.19/2020

బిట్వీన్ :
శ్రీ యండ్ర సుబ్బారావు ...పిటీషనర్
మరియు
శ్రీ ఇరదల ముద్దు క్రిష్ణ మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్

3వ రెస్పాండెంట్ : శ్రీ ఇరదల జనర్ధన తరక వంశీ, తండ్రి ముద్దు క్రిష్ణ, హిందు, మగ, వయస్సు 32 సం॥లు, బిజినెస్, R/o.D.No.4-1-4, కనకదుర్గ గుడి రోడ్డు, అగ్రహారం, ఏలూరు - 534001.

6వ రెస్పాండెంట్ : శ్రీ బుడ్డి అశోక్, తండ్రి తెలియదు, హిందు, మగ, వయస్సు 52 సం॥లు, అగ్రికల్చరు మరియు ఫిష్ బిజినెస్, కొవ్వలి, దెందెలూరు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. (Now ఏలూరు జిల్లా).

పై నెంబరు గ్రంథంలో మీరు 3వ మరియు 6వ రెస్పాండెంట్స్ అయి ఉన్నారు. మేము ఎన్నిసార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పత్రికా ముఖంగా తెలియజేయునది ఏమనగా **ది.19.02.2025వ** తేదీన పై నెంబరు గ్రంథంలో శ్రీకోర్టు వారి ఎదుట మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. కావున ఆరోజు ఉదయం గం.10.30 ని॥లకు స్వయంగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేనిఎడల సదరు పై నెంబరు గ్రంథము మీ యొక్క పరోక్షముగా విచారించబడును.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది : ది.19-2-2025

మాగంటి లక్ష్మణ్‌కుమార్
కె.వి.ఎస్.సోమయాజి
న్యాయవాదులు, ఏలూరు.
సెల్: 98852 79889

మహారాజశ్రీ 7వ అదనపు జిల్లా జడ్జి (ఫ్యామిలి జడ్జి) వారి కోర్టు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా

O.S.No.19/2020

బిట్వీన్ :
శ్రీ యండ్ర సుబ్బారావు ...వాది
మరియు
శ్రీ ఇరదల ముద్దు క్రిష్ణ మరియు ఇతరులు ...ప్రతివాదులు

3వ ప్రతివాది : శ్రీ ఇరదల జనర్ధన తరక వంశీ, తండ్రి ముద్దు క్రిష్ణ, హిందు, మగ, వయస్సు 32 సం॥లు, బిజినెస్, R/o.D.No.4-1-4, కనకదుర్గ గుడి రోడ్డు, అగ్రహారం, ఏలూరు - 534001.

6వ ప్రతివాది : శ్రీ బుడ్డి అశోక్, తండ్రి తెలియదు, హిందు, మగ, వయస్సు 52 సం॥లు, అగ్రికల్చరు మరియు ఫిష్ బిజినెస్, కొవ్వలి, దెందెలూరు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. (Now ఏలూరు జిల్లా).

పై నెంబరు గ్రంథంలో మీరు 3వ మరియు 6వ ప్రతివాదులు అయి ఉన్నారు. మేము ఎన్నిసార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పత్రికా ముఖంగా తెలియజేయునది ఏమనగా **ది.19.02.2025వ** తేదీన పై నెంబరు గ్రంథంలో శ్రీకోర్టు వారి ఎదుట మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. కావున ఆరోజు ఉదయం గం.10.30 ని॥లకు స్వయంగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేనిఎడల సదరు పై నెంబరు గ్రంథము మీ యొక్క పరోక్షముగా విచారించబడును.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది : ది.19-2-2025

మాగంటి లక్ష్మణ్‌కుమార్
కె.వి.ఎస్.సోమయాజి
న్యాయవాదులు, ఏలూరు.
సెల్: 98852 79889